ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి

- పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ బిల్లుల ఆదా
- రాయితీతోపాటు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం
- నరసన్నపేటలో నియోజకవర్గంలో 35 యూనిట్ల ఏర్పాటు
- విద్యుత్ వినియోగదారులు ముందుకు రావాలంటున్న అధికారులు

నరసన్నపేట: పెరుగుతున్న విద్యుత్ బిల్లులకు ప్రత్యామ్నాయంగా నిరంతర కాంతులకు సోలార్ విద్యుత్ ఉత్పత్తితో చెక్ పెట్టవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వలన బిల్లులు పెరుగుతున్నాయి. జేబులు ఖాళీ అవుతున్నాయని బాధపడకుండా విద్యుత్ బిల్లులను సోలార్ విద్యుత్‌తో తగ్గించుకోవచ్చని ఇటు అధికారులు, అటు సోలార్ వినియోగిస్తున్న విద్యుత్ వినియోగదారులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంతో విద్యుత్ బిల్లుల మోత తగ్గించుకోవచ్చు. ఈ పథకం ద్వారా వినియోగదారుల ఇళ్లపైనే సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకొని విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటికే 35 మంది వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేశారు.

పథకాన్ని ఇలా పొందాలి..

ఈ పథకాన్ని పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్లు లోపు ఉండాలి. ఫోన్‌లో సోలార్ ఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇంటి విద్యుత్ సర్వీస్ నంబర్, వినియోగదారుని వివరాలు, ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జతచేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- ఈపీడీసీఎల్ అప్లికేషన్ ఫీజు ఒకటి నుంచి మూడు కిలోవాట్లు వరకు రూ.1,200 కట్టాలి. ఐదు కిలోవాట్లకు పైబడి రూ.2,500 చెల్లించాలి.
- ట్రాన్స్‌కో అనుమతి పొందిన తరువాత వెండర్‌ను ఎంపిక చేసుకోవాలి. ఒక కిలో వాట్‌కు రూ.30 వేల చొప్పున సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఒక్కో వినియోగదారునికి గరిష్ఠంగా రూ.78 వేల సబ్సిడీ కేంద్రం ఇస్తుంది.
- ఇంటి పైకప్పుపై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్, ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా వినియోగదారులు వాడే విద్యుత్ లెక్కించే అవకాశం ఉంటుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లల్లో పొందవచ్చని విద్యుత్ అధికారులు అంటున్నారు.
- సోలార్ ప్యానల్, నెట్ మీటర్ అమర్చిన తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని నెల రోజుల్లోనే ప్రభుత్వం చెల్లిస్తుంది.
- 100 చదరపు అడుగుల్లో ఎర్పాటు చేసిన కిలో వాట్ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు మూడు, నాలుగు ప్యానల్స్‌కు నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
- 5 కిలో వాట్ల సోలార్ ప్యానల్స్‌కు నెలకు 600 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వినియోగదారుల అవసరాలకు పోనూ మిగిలిన విద్యుత్‌ను విద్యుత్‌శాఖ కొనుగోలు చేస్తుంది. దీనికి విద్యుత్ శాఖ యూనిట్‌కు రూ.2.30 పైసలు వినియోగదారునికి చెల్లిస్తుంది.

నరసన్నపేట నియోజకవర్గంలో పీఎం సూర్య ఘన్ రిజిస్ట్రేషన్ వివరాలు

మండలం	నరసన్నపేటటౌన్	నరసన్నపేట రూరల్	పోలాకి	జలుమూరు	సారవకోట
రిజిస్ట్రేషన్	50	15	34	26	25
డబ్బులు పేమెంట్	12	04	08	08	14
ఫ్యానల్ ఏర్పాటు	06	04	04	08	13


నరసన్నపేటలో వినియోగదారుడి ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

రూఫ్‌టాప్ ప్యానల్ రాయితీ వివరాలు

సామర్థ్యం	విద్యుత్ ఉత్పతి	ఖర్చు	కేంద్రం రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.60 వేలు	రూ.30 వేలు
2 కిలోవాట్లు	240 యూనిట్లు	రూ.1.40 లక్షలు	రూ.60 వేలు
3 కిలోవాట్లు	360 యూనిట్లు	రూ.1.99 లక్షలు	రూ.78 వేలు

బిల్లు బాగా తగ్గింది



నేను మూడు కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి సోలార్ ప్యానల్ పెట్టించుకున్నాను. గతంలో విద్యుత్ బిల్లు రూ.3 వేలకు పైబడి వచ్చేది. సోలార్ ప్యానల్ పెట్టిన తరువాత అసలు బిల్లు రావడం లేదు. మూడు నెలల నుంచి వాడుతున్నాను.

– జామి వెంకటరావు, మారుతీనగర్, నరసన్నపేట టౌన్

సద్వినియోగం చేసుకోవాలి



సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడానికి వినియోగదారులు ముందుకు రావాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకోవాలి. రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. కేంద్రం కల్పిస్తున్న సూర్య ఘర్ పథకం ద్వారా బిల్లులను తగ్గించుకొని ఉపసమనం పొందండి.

– ఇందిర, ఏడీ, ఈపీడీసీఎల్, నరసన్నపేట

క్లుప్తంగా

రూ.15 వేల పింఛన్ అందించండి


కదలలేని స్థితిలో ఉన్న ఉమాశంకర్

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాండ్రంకి ఉమాశంకర్‌కు రూ.15 వేల పింఛన్ అందించాలని తల్లిదండ్రులు ఈశ్వరరావు, గౌతమి కోరుతున్నారు. పుట్టిన నాటినుంచి మెదడులో నరాల సమస్య వలన నడవలేకపోతున్న తమ కుమారుడుకి సాధారణంగా దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ మాత్రమే వస్తోందన్నారు. ప్రత్యేకంగా ఇచ్చే రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. 75 శాతం దివ్యాంగత్వం ఉన్న ధ్రువీకరణ పత్రం అందించారని, 85 శాతం ధ్రువీకరణపత్రం అందించి పింఛన్ మంజూరు చేయాలని మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని ఎంఈఓ ఎం.వి.రమణ దృష్టికి తీసుకువచ్చారు.

వసతి గృహం పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ విశ్వమోహన్‌రెడ్డి

కొత్తూరు: మండలంలోని కురిగాం గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంతోపాటు ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ కృష్ణారావు, కురిగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరరావు, వసతి గృహం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతును ఇబ్బంది పెట్టొద్దు


తిలారులో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష

జలుమూరు: ధాన్యం విక్రయించిన రైతులకు మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దని, ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. మంగళవారం యలమంచిలి, తిలారు రైస్ మిల్లులను తనిఖీ చేసి ఆయా యాజమాన్యాలతో మాట్లాడారు. ట్రక్‌షీట్ వచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. రైతు ఖాతాకు 48 గంటల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు మిల్లులను తనిఖీ చేయాలని మండల అధికారులను ఆదేశించారు. చల్లవానిపేట సూపర్ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల అమ్మకాలు, ధరలు పట్టీని పరిశీలించారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ సుధారాణి, ఏఓ కె.సురేష్ కుమార్, ఆర్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి: మండలంలోని ఏకలవ్య పాఠశాలకు ప్రహరీ, ఇంటర్నల్ సీసీ రహదారి నిర్మాణానికి సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.2.6 కోట్ల ఉపాధి హామీ నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఐటీడీఏ స్థాపనకు కృషిచేయడమే కాకుండా.. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం చేపడతామన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఉపసర్పంచ్ భానోజీరావు, మాజీ ఎంపీపీ సలాన మోహన్‌రావు, పలువురు అధికారులు పాలొన్నారు.

పాము కాదు.. పొట్లకాయ



నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి కోల వీధికి చెందిన గెంబలి మణిమ్మ పెరట్లో పొట్లకాయ పాము ఆకారంలో ఉండటంతో స్థానికులు మంగళవారం ఆసక్తిగా తిలకించారు. పొట్ల కాయను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారని మణిమ్మ కుమారుడు రాంబాబు తెలిపారు.

అసంపూర్తి..



సారవకోట మండల పరిషత్ ఆవరణలోని ఎంఎంఎస్ కార్యాలయానికి ఆనుకుని వసతి గృహాల కోసం నిర్మించిన భవన నిర్మాణాలు కొన్నేళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఈ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ భవనాలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. ఈ భవనాలు వినియోగంలోకి తీసుకొస్తే పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. - సారవకోట

రహదారి పక్కనే చెత్త..



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని కొల్లివలస ఆర్అండ్‌బీ రహదారి. గాజులకొల్లివలస, ఆర్ఆర్ కాలనీ గ్రామాల్లో గల చెత్తను సేకరించి ఆమదాలవలస నుంచి చిట్టివలస, సైలాడ, రామచంద్రపురం గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పక్కనే వేస్తున్నారు. వారానికి ఒకసారి కాల్చడంతో ఆ రోజంతా పొగ, కాలుష్యంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ చెత్తను నివాసాలు లేనిచోట వేయించాలని స్థానికులు కోరుతున్నారు. - ఆమదాలవలస

అధ్వానం..



కొత్తూరు మండలంలోని సిరుసువాడ రోడ్డు అధ్వానంగా తయారైంది. కొత్తూరు నుంచి సిరుసువాడ వెళ్లే రహదారి వర్షం పడితే చిత్తడిగా మారుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును బాగుచేయాలని సిరుసువాడ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. - కొత్తూరు

తనిఖీ..



నరసన్నపేట మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయశాఖ టెక్కలి ఏడీ బి.వి.తిరుమలరావు మంగళవారం తనిఖీ చేశారు. ఓ-ఫారం ఉన్న ఏజెన్సీల నుంచే ఎరువులు, పురుగు మందులు తీసుకురావాలని సూచించారు. కల్తీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డుల మేరకు స్టాక్ ఉండాలన్నారు. రైతులకు బిల్లులు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. నరసన్నపేట ఏఓ కె.సునీత ఉన్నారు. - నరసన్నపేట

ఇళ్ల స్థలాల రద్దుకు ప్రభుత్వం కుట్ర

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: నిరుపేదలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్ల స్థలాల రద్దుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపట్టిన ఐదు నెలల పాలనలో పేదలపై కక్షసాధింపు చర్యలు ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో లక్ష మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాను ఇచ్చి సొంత ఇంటివారిని చేసిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. ఆయా ఇళ్ల స్థలాలు పొందిన పేదలు ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా నిర్మాణాలు పూర్తి చేసుకోలేకపోయారన్నారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసినప్పటికీ కొందరు గృహప్రవేశాలు చేయలేదన్నారు. అలాంటి ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవటం సరైన పద్ధతికాదన్నారు. చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న నాయకులకు పేదలపై అభిమానం ఉంటే వారి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. వారికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందివ్వాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్‌రెడ్డిపై అక్కసుతో పేదలను మోసం చేయాలనుకోవటం అన్యాయమన్నారు. చంద్రబాబు నిర్ణయాన్ని మార్చుకోకపోతే పేదలతో కలిసి పోరాటానికి సిద్ధమవుతామన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

డీఈఓ సుడిగాలి పర్యటన


చాపరలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

మెళియాపుట్టి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని కొసమాల, చాపర, మెళియాపుట్టి జిల్లా పరిషత్ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మెళియాపుట్టి జిల్లాపరిషత్ పాఠశాలలోని భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాల పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్శనలో ఆయనతో పాటు డైట్ ప్రిన్సిపాళ్లు భారతమ్మ, వేణుగోపాల్, లీలా మోహన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు

ఆమదాలవలస: పట్టణంలోని 23వ వార్డు లక్ష్ముడుపేట కూడలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బూర్జ మండలం ఓ.వి.పేటలో శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు గ్రామానికి చెందిన పొన్నాడ త్రినాథరావు సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంతో ఇంటికి వస్తున్నారు. ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో త్రినాథరావుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

15 లీటర్ల సారా స్వాధీనం

పాతపట్నం: మండలంలోని రామన్నగూడ గ్రామంలో 15 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని పట్టుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు మంగళవారం తెలిపారు. కొత్తూరు మండలం మత్రిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద సారాను శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారన్నారు. 14 రోజులు రిమాండ్‌కు తరలించారన్నారు. పాతపట్నం మండలంలోని కొదూరుకు చెందిన వ్యక్తి వద్ద 8 మద్యం బాటిళ్లు, ప్రహరాజపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ముమ్మర తనిఖీలు


ప్రైవేట్ ట్రావెల్స్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

సారవకోట: జాతీయ రహదారి 326(ఏ)లో సారవకోట మండలంలోని అర్లి టోల్ గేట్ వద్ద మంగళవారం పోలీసులు, ప్రత్యేక దళాలు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి గంజాయి, మత్తు పదార్థాలు రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు ఈ మార్గంలో వచ్చే వివిధ ప్రైవేట్ ట్రావెల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

ఇంటర్వ్యూకు 76 మంది హాజరు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తూరు: వసప కేజీబీవీలో ఖాళీగా ఉన్న నాలుగు నాన్ టీచింగ్ పోస్టులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు 76 మంది హాజరైనట్లు ఎంఈఓ గోవిందరావు తెలిపారు. ఈ పోస్టులకు 82 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మన్, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

‘ఉచిత విద్యుత్’పై మోసం


మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: ఉచిత విద్యుత్‌పై కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు మోసం చేస్తోందని మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరులో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పాత బకాయిల పేరుతో అధిక బిల్లులు చూపించి విద్యుత్ కనెక్షన్లు తొలగించడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు, ఐదు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారన్నారు. సంపద సృష్టించడమంటే విద్యుత్ చార్జీలు పెంచడమా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లు యర్లంకి ధర్మారావు, నాస బాలకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తిర్లింగి కృష్ణమోహన్‌రావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదుచేయాలి


నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

హిరమండలం: కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక శుభలాయి ఆర్అండ్ఆర్ కాలనీలో కిట్టలపాడు కురవమ్మ అనే మహిళ నివాసముటుంది. ఆమెకు చెందిన స్థలాన్ని ఇటీవల కొంతమంది ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నించారు. దీనిని అడ్డుకోవడంతో దాడిచేసి కులంపేరుతో దూషించారని బాధితురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలగ శ్రీరామ్మూర్తి,డి.వెంకటరమణ, కృష్ణ, మేకల తులసి, కవిటి ఆదినారాయణ, లోకొండ కేశవ, జన్ని సింహాచలం పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కారాదు


పాతపట్నం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ తిరుమలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) దినోత్సవాన్ని అన్ని మండల కేంద్రాల్లో గల భవిత కేంద్రాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాలొని దివ్యాంగుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ప్రతిభకు వైకల్యం అడ్డు కారాదన్న స్ఫూర్తిని విభిన్న ప్రతిభావంతుల్లో నింపాలన్నారు. ప్రతీ దివ్యాంగునిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దానిని ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు.

- సాక్షి నెట్‌వర్క్


బూర్జ: మదనాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


ఆమదాలవలస: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు


సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది


జలుమూరు: ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు


హిరమండలం: మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు


సారవకోట: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ఎం.వి.రమణ


నరసన్నపేట: విభిన్న ప్రతిభావంతులకు బహమతులు అందిస్తున్న ఎంఈఓలు

దళితులపై దాడి అమానుషం


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

హిరమండలం: మండలంలోని భగీరథపురంలో దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. కులవివక్ష పోరాట సమితి నాయకుడు కృష్ణతో కలిసి మంగళవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కార్తీక వనభోజనాలకు వెళ్లిన వారిని కులం పేరుతో దూషించారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో దళితుల పట్ల వివక్ష చూపడం దారుణమన్నారు. గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రజాసంఘాల ప్రతినిధులు సొండి ఆసిరయ్య, సురేష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.